సాక్షి ఒడిశా

I

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



గోపబంధుదాస్ జయంతి

గోపబంధుదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించారు.

- IIలో

చార్జిషీట్ జారీ..

పర్లాకిమిడి: న్యాయవాదులపై తరచూ దాడులు జరుగుతున్న నేపథ్యంలో బరంపురంలో సీనియర్ న్యాయవాది పిత్తాబసు పండా కేసు ఒడిశాలో సంచలనం సృష్టించింది. దీంతో గత ఏడాది నవంబరు 9న పర్లాకిమిడి జంగం వీధిలో అడ్వకేటు పత్తి రామారావు కేసు తిరిగి తెరపైకి గురువారం వచ్చింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి డి.వెంకటరావు, నిందితుడు డి.సతీష్ పట్టుబడ్డారు. మరో నిందితుడు బి.కిరణ్ పరారీలో ఉన్నాడు. ఈ కేసును అప్పట్లో పర్లాకిమిడి జిల్లా జడ్జి కోర్టులో నిందితుల తరఫున ఏ ఒక్క లాయరు వాదించేందుకు ముందుకు రాకపోవడంతో నిందితులు హైకోర్టులో అపీల్ చేసుకున్నారు. ఈ కేసును పత్తి రామారావు తరఫున బార్ అసోసియేషన్ సభ్యుడు రామ కృష్ణనాయక్ ఆదర్శ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో సాక్ష్యాలు లేనందున సెప్టెంబర్ 8న డిశ్చార్జి పిటిషన్‌కు నిందితులు అపీల్ చేశారు. సీసీ పుటేజీ, నిందితుల్లో ప్రధాన సూత్రధారి డి.వెంకటరావు జరిపిన లావాదేవీలు బయటపడిన తరువాత తిరిగి ఈ కేసును విచారణకు జిల్లా జడ్జి జగదీష్ ప్రసాద్ మహంతి ఆదేశాలిచ్చారు.

ఓటింగ్ పూర్తి..
ఫలితాలు నిక్షిప్తం

● రాయగడ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



మున్సిపాలిటీ కార్యాలయం ముందు పోలీసుల బందోబస్తు

రాయగడ: రాయగడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్ర పండ పై 19 మంది కౌన్సిలర్లు తీసుకువచ్చిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గురువారం ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఎన్నికల అధికారిగా సబ్ కలెక్టర్ రమేష్ చంద్ర జెన్న వ్యవహరించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య నిర్వహించిన ఈ ఓటింగ్ ప్రక్రియలో 19 మంది కౌన్సిలర్లతో పాటు అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటున్న వైస్ చైర్మన్ శుభ్ర పండ రాష్ట్ర మాజీ మంత్రి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగన్నాథ సరకతో కలిసి ఓటింగ్‌లో పాల్గొనేందుకు హాజరయ్యాడు. ఉదయం 11 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా అంతకు ముందు ఎన్నికల అధికారి జెన్న ఓటింగ్ ఎలా చేయాలి అన్న అంశం పై సుమారు పది నిమిషాల పాటుగా అవగాహన కల్పించారు. అనంతరం 12 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమై 13.30 గంటలకు పూర్తయ్యింది. రాయగడ మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులకు గాను 21 మంది ఓటింగ్ లొ పాల్గొన్నారు. మిగతా ఇద్దరు బీజేపీ మరో కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్‌లు ఓటింగ్‌లో పాల్గొనలేదు.



ఓటింగ్‌లో పాల్గొనేందుకు మాజీ మంత్రి జగన్నాథ సరకతొ వస్తున్న శుభ్రపండ



బ్యాలెట్ బాక్స్‌ను తరలిస్తున్న దృశ్యం

ఫలితాలు నిక్షిప్తం..

గురువారం ఉదయం 12 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియలో భాగంగా అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటున్న శుభ్రపండ తన ఓటును అందరికి కనిపించేలా చూపించి వేయగా మిగత 20 మంది కౌన్సిలర్‌లు తమ ఓటును గుప్తంగా వేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఓటింగ్ ప్రక్రియ పూర్తయినప్పటికీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ 1.30 వరకు ఉండటంతో అంతవరకు వేచి ఉన్నారు. అనంతరం ఎన్నికల అధికారి జెన్న ఓటింగ్ ప్రక్రియ పూర్తయినప్పటికీ లెక్కింపు జరగదని అందుకు కటక్ హైకోర్టు ఆదేశానుసారం బ్యాలెట్ బాక్స్‌ను సీల్ చేసి దాన్ని స్థానిక ట్రెజరీ కార్యాలయంలో భద్రపరుస్తామని ప్రకటించారు. కోర్టు ఆదేశానుసారం ఈ నెల 15న కోర్టు తదుపరి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత కట్టుదిట్టమైన పోలీసుల భద్రత మధ్య బ్యాలెట్ బాక్స్‌ను తీసుకువచ్చి ట్రెజరీలో భద్రపరిచేందుకు తరలించారు.

ఓ వైపు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైన కొద్ది సమయం తర్వాత శుభ్రపండ మద్దతు దారులు కోర్టు ఎన్నికల ఫలితాలపై స్టే విధించిన విషయం తెలుసుకుని హర్షం ప్రకటించారు. పార్టీ జెండాలతొ మున్సిపాలిటీ కార్యాలయం బయట సందడి చేశారు.

న్యాయమే గెలుస్తుంది: శుభ్రపండ

తన పై తీసుకువచ్చిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఫలితాలను వెల్లడించకూడదని హైకోర్టు స్టే విధించడం పై ఆమె మాట్లాడుతూ బీజేడీ ప్రజల పార్టీగా గుర్తింపు పొందిందని అన్నారు. అవిశ్వాస తీర్మానం తీసుకువచ్చినప్పటికీ ధర్మమే ఎప్పటికైనా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేడీ సుప్రీం నవీన్ పట్నాయక్ కౌన్సిలర్‌లపై విప్ జారీ చేయడం పార్టీ క్రమశిక్షణకు అద్దం పడుతుందని దాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం అనివార్యమని అన్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ నెల 15 వ తేది వరకు వేచి చూడాల్సిందేనని అన్నారు.



ఓటింగ్‌లో పాల్గొనేందుకు వస్తున్న 19 మంది కౌన్సిలర్లు



అస్వస్థతకు గురైనప్పటికీ వీల్‌చైర్‌లో వచ్చిన 4వ వార్డు కౌన్సిలర్ ప్రతిమా పాణిగ్రహి

న్యూస్‌రీల్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక



సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ఉలక

రాయగడ: దక్షిణ ఒడిశాలోని గ్రామాలను అభివృద్ధి చేయడమే ధ్యేయమని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ, రూరల్ డవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ శాఖల స్టాండింగ్ కమిటీ చైర్మన్ సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ మేరకు జరిగిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని దక్షిణ ఒడిశా అన్ని రంగాల్లో చాలా వెనుకబడి ఉందని, ముఖ్యంగా గ్రామాలకు సరైన రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రూరల్ డవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తాను, ఈ ప్రాంత అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానన్నారు. అందుకు ఈ ప్రాంత సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే సదావకాశం లభించిందని పేర్కొన్నారు.

సరిహద్దులో చిరుత పులి కళేబరం



మొక్కజొన్న పొలంలో చిరుత కళేబరం

కొరాపుట్: రాష్ట్ర సరిహద్దులో చిరుత పులి కళేబరం కలకలం సృష్టించింది. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుందేయి అటవీ ప్రాంతంలో మొక్కజొన్న పొలంలో గిరిజనులు చిరుత పులి కళేబరం గమనించారు. వెంటనే అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ చిరుత సమీప చత్తీస్‌గఢ్ రాష్ట్ర అడవుల నుంచి సరిహద్దు దాటి జిల్లాలోకి వచ్చినట్లు అటవీ శాఖ సిబ్బంది అభిప్రాయ పడ్డారు. ఈ సమాచారం చత్తీస్‌గఢ్ రాష్ట్ర అధికారులకు అందించారు. మరో వైపు వేటగాళ్ల దాడుల వలన ఇది మృతి చెందినట్లు వార్తలు వెలువడ్డాయి.

అగ్ని ప్రమాదంలో మహిళ మృతి



ప్రియాంక పండా(ఫైల్)

కొరాపుట్: అగ్ని ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ఓఎంపీ కాలనీ మీద లైన్‌లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ శివశంకర్ పాత్రో నివాసంలో షార్ట్ సర్క్యూట్ కారణంలో మంటలు చెలరేగాయి. అయితే కుటుంబ సభ్యులను రక్షించే క్రమంలో అతని సతీమణి ప్రియాంక పండా (22) మంటలకు ఆహుతయ్యింది. తన పిల్లలను, భర్త, అత్తని రక్షించే క్రమంలో ఇంట్లో చివరకు ఉండిపోయింది. మంటల స్థాయి పెరగడంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు మిగతావారు గాయాలతో బయట పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

15 అడుగుల కొండ చిలువ పట్టివేత



అడుగుల కొండ చిలువ పామును పట్టుకున్న మఝితో గ్రామస్తులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి అటవీ విభాగ పరిధి బొరగాం గ్రామంలో బుధవారం సాయంత్రం 15 అడుగుల కొండ చిలువ పామును స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యులు పట్టుకున్నారు. గ్రామంలో పామును చూసిన ప్రజలు భయభీతులయ్యారు. వెంటనే వారు బోయిపరిగుడ అటవీ విభాగ రేంజర్ సందీప్ పాణిగ్రాహికు తెలియజేశారు. రేంజర్ వెంటనే స్నేక్ హెల్ప్‌లైన్ కార్యకర్త డొంబురు మఝికి తెలిపారు. మఝి బొరిగాం గ్రామానికి వచ్చి 15 అడుగుల కొండచిలువ పామును పట్టుకున్నారు. ఆ పాము బరువు 25 కిలోలు ఉందని మఝి వెల్లడించారు. పట్టుబడిన పామును మహుళి పంచాయతీ పెట్టఘాట్ మధుభన్ రిజర్వ్ ఫారెస్టులో విడిచి పెట్టినట్లు డొంబురు మఝి వెల్లడించారు.

బీజేపీ ప్రతినిధుల బృందం పర్యటన



టొలొన గ్రామంలో పాడైన రహదారిని పరిశీలిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి లంజియా సవర తెగకు చెందిన ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో బీజేపీ ప్రతినిధుల బృందం బుధవారం పర్యటించింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టి.గోపి ఆనంద్, సీనియర్ నాయకులు శివశంకర్ ఉలక, త్రినాథ్ గొమాంగో తదితరులతో కూడిన ఈ బృందం లంజియా సవరలు నివసించే పుటాసింగి, జలత్తార్, టొలన, అబడ, శగడ తదితర గ్రామాల్లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆయా గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులను కలసి వివరాలు సేకరించారు. వర్షాల కారణంగా పాడైపోయిన రహదారులు, చెక్ డ్యాంల పరిస్థితిని అధ్యయనం చేశారు. ఈ ప్రాంతాల్లో వర్షాల కారణంగా నష్టం జరిగిన వివరాలను ఒక నివేదిక రూపంలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణి దృష్టికి తీసుకెళ్లి, పరిహారం అందేలా చూస్తామని తెలియజేశారు.



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ ప్రతినిధుల బృందం

ఐదు కిలోమీటర్లు డోలీపై..



డోలీలో తెచ్చిన రోగితో అంబులెన్స్ కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి సమకుండ గ్రామానికి రహదారి సదుపాయం లేక ఓ వ్యక్తి ఐదు కిలోమీటర్ల పాటు డోలీపై మోసుకెళ్లారు. గురువారం ఓ వ్యక్తికి అనారోగ్యం చేయడంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. సుమకుండ వరకు దారి లేకపోవడంతో రోగిని మీరే తీసుకురావాలని అంబులెన్స్ డ్రైవర్ సూచించారు. దీంతో ఐదు కిలోమీటర్ల పాటు కుటుంబ సభ్యులు డోలీలో మోసుకుంటూ వచ్చారు. అక్కడ రెండు గంటల పాటు ఎదురు చూశాక అంబులెన్స్ వచ్చి ఆ వ్యక్తిని ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

సునాబెడాలో యువతీ యువకుల బలవన్మరణం



బిస్వాల్ మృతదేహం కోసం కొలాబ్ రిజర్వాయర్ వద్ద గాలిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సునాబెడా పట్టణంలో ఇద్దరు యువతీ యువకుల ఆత్మహత్యలు అందరినీ కలవరపాటుకు గురి చేశాయి. గురువారం 4వ నంబర్ వార్డులో డీపీ క్యాంప్‌నకు చెందిన ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థిని తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దాంతో బాధిత కుటుంబం 2వ వార్డులో నివాసం ఉంటున్న బిస్వాల్ ప్రధాన్ (22) పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటికే స్నేహితులతో కొలాబ్ రిజర్వాయర్ సమీపంలో బిస్వాల్ ఉన్నారు. తనపై కేసు పెట్టారని తెలియడంతో ఆయన రిజర్వాయర్‌లోకి దూకేశాడు. స్నేహితులు అగ్ని మాపక బృందానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని వెలికి తీశారు. రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.



యువతి ఇంటి వద్ద ప్రజలు

ఆటోను ఢీకొన్న వ్యాన్

● ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

జయపురం: ఒక వ్యాన్ ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం జయపురం సమితి చిలిగుడ గ్రామం వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జయపురం నుంచి నలుగురు ప్రయాణికులతో ఒక ఆటో డొంగర పంశి గ్రామానికి వెళ్తోంది. ఆ సమయంలో చిలిగుడ గ్రామం వద్ద వెనుక నుంచి వస్తున్న ఒక వ్యాన్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్నవారితో పాటు డ్రైవర్ కిందపడ్డారు. ఆటోలో పయనిస్తున్న వారికి స్వల్ప గాయాలు, డ్రైవర్ రామకృష్ణ హరిజన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని జయపురంలోని కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నలుగురు ప్రయాణికులను డిశ్చార్జి చేశారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రామకృష్ణకు చికిత్స చేస్తున్నారు. సంఘటన ప్రాంతానికి జయపురం సదర్ పోలీసు వెళ్లి ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు.



చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ రామకృష్ణ

వాగు దాటితేనే ఊరు



నిత్యావసర సరుకులతో వాగు దాటుతున్న గిరిజనులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితిలో నాలుగు గ్రామాలకు రహదారి సదుపాయం లేదు. వాగు దాటితేనే ఆ గ్రామానికి చేరుకోగలరు. ఇటీవల కురిసిన వానకు గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లు కొట్టుకుపోయాయి. సనుగూఢ, కేందుగూఢ, బైగూఢ, నువగూఢ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత 15 రోజులుగా అత్యవసర సమయాల్లో వాగు దాటి వస్తున్నారు. గురువారం వారపు సంతకు వెళ్లిన గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



ప్రమాదకర ప్రయాణం చేస్తున్న బొండా గిరిజనులు

మత్తిలి సమితిలో చిత్రకొండ ఎమ్మెల్యే పర్యటన



దుస్పానడు గ్రామంలో చిత్రకొండ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన గిరిజనులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి దుస్పానాడు గ్రామంలో గురువారం చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో పర్యటించారు. స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానికులతో ఆయన సమస్యలపై చర్చించారు. ఒకప్పుడు మావోల గుప్పిట్లో ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు వెలుగుచూస్తోంది. అందుకే తాగునీరు, వైద్యం, విద్య, రహదారి సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేకు స్థానికులు విన్నవించారు.



గృహంలో వృద్ధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మంగుఖీలో

మందిరాలకు పోటెత్తిన భక్తులు



పట్టణంలో ప్రారంభమైన కార్తీక నగర సంకీర్తనలు

జయపురం:

కార్తీక మాసం ప్రారంభం కావడంతో గురువారం మందిరాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా దేవతలకు ప్రాతఃకాల పూజలు, దీపారాధనలు వీక్షించేందుకు, హారతులు స్వీకరించేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం స్థానిక శ్రీజగన్నాథ్ మందిరంలో భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. భక్తులకు శ్రీజగన్నాథుడు, సుభద్ర, బలభద్రలు ప్రత్యేక అలంకరణలతో దర్శనమిచ్చారు. అలాగే చైతన్య మందిరం.రఘునాథ్ మందిరం, మా భగవతీ మందిరం, వల్లభ నారాయణ మందిరం, స్థానిక గీతా మందిరంలో కూడా కార్తిక పూజలు ప్రారంభమయ్యాయి. నేటి నుంచి కార్తీక సంకీర్తనలతో భజన బృందాలు వేకువ జామున నగర సంచారం ప్రారంభించాయి. శ్రీజగన్నాథ్ మందిరంలో ప్రముఖ వ్యక్తులు బిజయ జనాదేవ్, ప్రదీప్ రథ్ రామనాథ్ త్రిపాఠీ, పండిత కృష్ణ దాస్, బిరెన్ మోహణ పట్నాయిక్ తదితరులు పూజలు చేశారు.



స్థానిక జగన్నాథ్ మందిరం వద్ద భక్త సముదాయం



భక్తులకు ప్రాతఃకాల దర్శనమిచ్చిన శ్రీజగన్నాథ్ సుభద్ర, బలభద్రులు



దేవతా మూర్తులను తిలకిస్తున్న భక్త జనం

క్లుప్తంగా

పరామర్శ..



శంకర్ బెహరాకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: ఈ నెల 2వ తేదీన కురిసిన భారీ వర్షానికి స్థానిక కంద్రవీధిలో శంకర బెహరా ఇల్లు కూలిపోయింది. ఆ కుటుంబాన్ని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి గురువారం పరామర్శించారు. ఇల్లు నిర్మించుకోవడానికి బాధితుడు శంకర బెహరాకు కొంత మొత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వపరంగా నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని బాధితుడుకి హామీ ఇచ్చారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన



ఉత్తమ ర్యాంకు సాధించిన రేణుశ్రీ, ప్రసన్నలకు సత్కరిస్తున్న రామరాజు

పర్లాకిమిడి: గుసాని సమితి కోర్సండ గ్రామంలో ప్రభుత్వ రాజీవ్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో చదివి 2024– 25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఒడిశా బోర్డు పరీక్షల్లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన గుంపు రేణుశ్రీ (521/600), కలగ ప్రసన్న (520/600)ను పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు నగదు, మెమెంటోలతో గురువారం అభినందించారు. ఇద్దరు విద్యార్థినుల తల్లిదండ్రులను ఈ సందర్భంగా రామరాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజశేఖరం, కమిటీ చైర్మన్ డి.కామేశ్వరం నాయుడు, జి.ఢిల్లీశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా సేవలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీలపై ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించా రు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, పీజీఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు, తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే పని ప్రజలకు సంతృప్తికరంగా ఉండాలన్నారు. పని ఒత్తిడి ఉన్నా అత్యవసరమైన పనులకు తప్పని పరిస్థితుల్లో హాజ రు కావాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మ ద్ఖాన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో సీఎస్‌డీటీలు కీలకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్లు జి.జయదేవి, పద్మావతి, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

శ్రీకాకుళం రూరల్: సింగుపురం ఫ్లెటైర్ బ్రిడ్జిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఫార్చునర్ వాహనంలో విశాఖ పట్నం నుంచి ఇచ్చాపురం వెళ్తుండగా అదే రూట్‌లో వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు.

సీపీఎం నేతలపై కేసు కొట్టివేత



కోర్టు వద్ద సీపీఎం నాయకులు

కొత్తూరు: వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2016లో పోరాటం చేసిన సీపీఎం నేతలపై అప్పటి టీడీపీ ప్రభుత్వం పెట్టిన కేసును గురువారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కొట్టివేసినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు తెలిపారు. ప్రభుత్వం పెట్టిన కేసులో నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టినట్లు చెప్పారు. కేసులో సీపీఎం జిల్లా నాయకులు భవిరి కృష్ణమూర్తి, గంగరాపు సింహాచలం, కె.నాగమణి, సిర్ల ప్రసాద్, కె.మిన్నారావు, శంకరరావు, ఆఫీస్, ముఖలింగం తదితరులు ఉన్నారు. కేసును అడ్వకేట్ మహంతి అప్పారావు వాదించారు.

అక్రమ బదిలీలు నిలిపివేయాలి

శ్రీకాకుళం: తమకున్న పలుకుబడితో అంతర్ రాష్ట్ర బదిలీ లకు తెరతీస్తున్న ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు గురువారం డిమాండ్ చేశారు. ఇకపై ఉపాధ్యాయ బదిలీలన్నీ పారదర్శకంగా, చట్టబద్ధంగా, అవినీతి, అక్రమాలు లేని విధంగా చేస్తామ ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని, ఇప్పు డు పలుకుబడి బదిలీలు చేపట్టడం దారుణమన్నారు. బదిలీలు నిలుపుదల చేయనిపక్షంలో న్యాయపోరాటం తప్పదన్నారు.

ఘనంగా గోపబంధు దాస్ జయంతి

పర్లాకిమిడి:

స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో గురువారం ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతి ఉత్సవాన్ని ఆడంబరంగా నిర్వహించారు. కవి, సమాజసేవకుడు, సంఘ సంస్కర్త, జర్నలిస్టు, స్వతంత్ర ఒడిశా ఉద్యమంలో పాల్గొన్న గోపబంధు దాస్ ఆశయాలను ఆచార్యులు మురళీమోహన్ ప్రధాన్ విద్యార్థులకు తెలియజేశారు. సరస్వతీ శిశు విద్యామందిర్‌లో సేవా దినోత్సవంగా నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధాన ఆచార్యులు సరోజ్ పండా ఆధ్వర్యంలో నిర్వహించారు.



రాయగడ: గోపబంధు దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉత్కళ సమ్మేళని సభ్యులు

రాయగడలో..

రాయగడ: ఉత్కళ సమ్మేళిని ఆధ్వర్యంలో గురువారం ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ పార్క్‌లో గల గోపబంధు దాస్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సబ్ కలెక్టర్ రమేష్ చంద్ర జెనా హాజరై గోపబంధు దాస్ సేవలను కొనియాడారు. ఉత్కళ సమ్మేళిని అధ్యక్షుడు, న్యాయవాది బ్రజ సుందర్ నాయక్, సభ్యుడు సునిల్ చంద్ర పండా, తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతిని ఘనంగా గురువారం నిర్వహించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని గోప బంధు దాస్ విగ్రహానికి పార్టీలకు అతీతంగా ప్రజలు నివాళులర్పించారు. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్, డీసీసీ అధ్యక్షుడు రుపుధర్ బోత్ర, తదితరులు గోపబంధు విగ్రహానికి నివాళులర్పించారు. కొట్‌పాడ్‌లో సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ఉన్న గోపబంధు విగ్రహం వద్ద జయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాది పంకజ్ పాత్రో, మేధావులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: గోపబంధు దాస్ జయంతి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

జయపురంలో..

జయపురం: బహుముఖ ప్రజ్ఞాశాలి, పండిత ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతిని జయపురంలో గల పలు సంస్థల్లో గురువారం నిర్వహించారు. ఉత్కళ సమ్మిళినీ కొరాపుట్ జిల్లా శాఖ, పూజ సంసద్ జయపురం, స్థానిక టౌన్ హాల్ జంక్షన్‌లో గల గోపబంధు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్కళ సమ్మిళినీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రో, జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది మదన్‌మోహన్ నాయక్, పూజ్య సూజ సంసద్ అధ్యక్షుడు, ఇంజినీర్ కేదార్ నాథ్ బెహరా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బిరెన్ మోహన్ పట్నాయక్, బీజేడీ సీనియర్ నేత బాలా రాయ్, జయపురం అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ పరిచాలన కమిటీ మాజీ అధ్యక్షుడు దేవేంద్ర బాహిణీపతి, తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: మాట్లాడుతున్న ఆచార్య మురళీ మోహన్ ప్రధాన్



జయపురం: గోపబంధు దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు



కొరాపుట్: కొరాపుట్‌లో గోప బంధు దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రఘురాం మచ్చో, తదితరులు



కొరాపుట్: కొట్‌పాడ్‌లో బంధు దాస్ విగ్రహానికి నివాళుకులర్పిస్తున్న మేధావులు

20 నుంచి కాళీ పూజలు ప్రారంభం



ముహూర్తపు రాట పూజల్లో శివపట్నాయక్, శివాజీ దాస్

రాయగడ: స్థానిక సమితి కార్యాలయం సమీపంలో గల ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు కాళీ పూజలు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి గురువారం మందిరం ప్రాంగణంలో ముహూర్తపు రాట కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్‌కు చెందిన శివకుమార్ పట్నాయక్, శివాజీ దాస్‌లు ముహూర్తపు రాట పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రాయగడకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో గల తెరువలి సమీపంలో ఉన్న దక్షిణ కాళి మందిరంలో ప్రత్యేక పూజలను నిర్వహించి అక్కడి నుంచి పసుపు,కుంకుమలను తీసుకువచ్చి కాళీ మందిరంలో ఉంచారు. ఈ సందర్భంగా కాళీ మాత విగ్రహ తయారీలో తీసుకువచ్చిన పసుపు, కుంకుమలను కలసి రూపొందిస్తారని శివపట్నాయక్ తెలియజేశారు. గత 43 సంవత్సరాలుగా ఈ పూజలను నిర్వహిస్తున్నామని పూజల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సన్నహాలు చేస్తున్నామని చెప్పారు.



దక్షిణ కాళీ మందిరం నుండి పసుపు కుంకుమలను తీసుకువస్తున్న దృశ్యం

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

- నాలుగు నెలల కిందటే వివాహం
- దేవునల్తాడలో విషాదఛాయలు



చినబాబు(ఫైల్)

వజ్రపుకొత్తూరు: దేవునల్తాడ గ్రామానికి చెందిన బుడగట్ల చినబాబు(42) సముద్రంలో చేపల వేట కు వెళ్లి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవునల్తాడకు చెందిన బుడగట్ల కేశవులు, గుణసరమ్మ కుమారుడు చినబాబుకు నాలుగు నెలల క్రితం ఒడిశా రాష్ట్రం పూరీకి చెందిన నారాయణమ్మతో వివాహం జరిగింది. జీవనోపాధిలో భాగంగా గురువారం వేకువజామున తోటి మత్స్యకారులతో కలిసి సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. ఉదయం 8 గంటల సమయంలో వలను లాగే ప్రయత్నంలో అలలు ఎగసిపడటంతో చినబాబు తెప్ప నుంచి జారి పడి మృతి చెందాడు. విషయాన్ని సర్పంచ్ టి.వరదరాజులు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.వెంకన్న, గ్రామ పెద్దలు వజ్రపుకొత్తూరు పోలీసులకు తెలియజేయడంతో సిబ్బంది తీరానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి బుడగట్ల గుణసరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రపుకొత్తూరు హెచ్‌సీ కె.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

గ్రామీణ బ్యాంకు సేవలకు బ్రేక్

హిరమండలం: జిల్లాలో ఏపీ గ్రామీణ బ్యాంకు సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి అన్ని రకాల ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఖాతాదారులకు వివిధ మాధ్యమాల ద్వారా ఇప్పటికే బ్యాంకు అధికారులు తెలియజే శారు. మళ్లీ ఈ నెల 13న ఉదయం 10 గంటలకు సేవలు ప్రారంభంకానున్నాయి. గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ ఇందుకు కారణం. కొద్దిరోజు ల కిందట నాలుగో విడత బ్యాంకుల విలీన ప్రక్రి యకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఒక రాష్ట్రంలో ఒక గ్రామీణ బ్యాంకు మాత్రమే ఉండాలని సూచించింది. దీంతో రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులన్నీ విలీనం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారనున్నాయి. 4 గ్రామీణ బ్యాంకు లను విలీనం చేసే ప్రక్రియలో భాగంగానే సాంకేతిక అంశాలను సరిచేసేందుకు సేవలు నిలిపివేసినట్టు బ్యాంకు వర్గాలు తెలిపాయి.

80 బ్రాంచ్‌లలో..

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఏడు జిల్లా ల్లో విస్తరించి ఉంది. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలో 278 శాఖలు ఉన్నాయి. మన జిల్లాకు సంబంధించి 80 శాఖలు ఉన్నాయి. ఈ నెల 13 నుంచి ఈ శాఖలన్నీ ఏపీ గ్రామీణ బ్యాంక్‌గా సేవలందించనున్నాయి. మరోవైపు ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ సేవలు సైతం నిలిచిపోయాయి. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, ఏటీఎం సేవ లు, బ్యాంక్ మిత్ర సేవలు కూడా నిలిచిపోయా యి. దీంతో అత్యవసర పనులు ఉన్న ఖాతాదారు లు అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా ఏపీజీవీబీల్లో స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజల సేవలు ఉంటాయి. ఇప్పటికే ఖాతాదారులకు బ్యాంకు వర్గాలు సమాచారం ఇచ్చినా, కొందరికి విషయం తెలియక అసౌకర్యానికి గురయ్యారు.



ఎల్ఎన్‌పేటలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు

'స్పిరిట్ కలపలేదు'

శ్రీకాకుళం క్రైమ్ : సారవకోట మండలం ఆవలంగి గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు గత నెల 3న పట్టుకున్న నకిలీ మద్యం కేసుపై పాతపట్నం సీఐ కోటు కృష్ణారావు గురువారం వివరణ ఇచ్చారు. రోడ్డుపై ఖాళీ మద్యం బాటిళ్లు ఏరుకుంటున్న వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఆ రోజున 211.90 లీటర్ల నకిలీ మద్యం పట్టుకున్నామని, దుర్గా వైన్‌షాపులో అనధికారికంగా అమ్మకాలు జరుపుతున్న ఐదుగురు ముద్దాయిలను గుర్తించామన్నారు. స్పాట్‌లోనే ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, షాపు లైసెన్సుదారున్ని అదే నెల 15న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. లేబ్ రిపోర్టు ప్రకారం మద్యంలో ఎటువంటి స్పిరిట్ ఉపయోగించలేదని చెప్పారు. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు వచ్చే లక్షలాది ప్రజల డిమాండ్ దృష్ట్యా రూ.99బాటిళ్లలోని మద్యాన్ని నీటితో కలిపి రూ.160 మద్యం సీసాలలో నింపుతున్న సమయంలో పట్టుకున్నట్లు వివరించారు. ముద్దాయిలు సకలాభక్తుల నీలకంఠేశ్వరరావు, పిట్ట పైడిరాజు హైకోర్టు నుంచి ఏంటిసిపేటరి బెయిల్ తెచ్చుకున్నారు తప్ప ఈ కేసు నుంచి ఎవరినీ తప్పించలేదన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి



చిన్నారులతో ముచ్చటిస్తున్న సినీ నటుడు సొహైల్

సోంపేట: తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు పట్టుదలతో చదవాలని బిగ్‌బాస్ ఫేం, సినీ నటుడు సొహైల్ అన్నారు. గురువా రం సోంపేటలోని మహర్షి విద్యానికేతన్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ముందుగా కంచిలిలో కంచమ్మ తల్లిని దర్శనం చేసుకున్నారు. అనంతరం సోంపేట మహర్షి విద్యానికేతన్ యాజమాన్యంతో ఉన్న పరిచ యం మేరకు పాఠశాలకు వచ్చి చిన్నారులతో సందడి చేశారు.

బొల్లినేని విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన బీఎస్సీ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ఫలితాల్లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. డిస్టింక్షన్‌లో 15 మంది, ప్రథమ శ్రేణిలో 43 మంది, ద్వితీయ శ్రేణిలో ఏడుగురు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీపద్మజ మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రతీ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

12న సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు ఎంపికలు ఈ నెల 12న జరగనున్నాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూన రవికుమార్, ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు గురువారం తెలిపారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా ఉదయం 10 గంటలకు ఎంపికల ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94410 11391 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కుంద్ర సమితి అధ్యక్షుడిగా తరుణ సేన్ బిశాయి



అధ్యక్ష పదవీ బాధ్యతలను చేపట్టిన తరుణసేన్ బిశాయితో సమితి సభ్యులు, సర్పంచ్‌లు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి అధ్యక్షునిగా ఆ సమితి ఉపాధ్యక్షుడు తరుణ సేన్ బిశాయి గురువారం పూర్తి బాధ్యతలు చేపట్టారు. గత అధ్యక్షురాలు రాజేశ్వరి పోరజపై అవినీతి ఆరోపణలు రావటం ఆమెపై సర్పంచ్‌లు, సమితి సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడంతో తీర్మానంపై ఓటింగ్ జరగకముందే ఆమె రాజీనామా చేసిన విషయం పాఠకులకు విదితమే. ఆమె రాజీనామా తర్వాత ఉపాధ్యక్షుడు తరుణసేన్ బిశాయిని అధికారులు తాత్కాలిక అధ్యక్షునిగా నియమించారు. నేడు అతడికి అధ్యక్షునిగా పూర్తి బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా బిశాయి ప్రసంగిస్తూ నూతన అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగేంత వరకు సమితి సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, సమితి సిబ్బంది తనకు పూర్తిగా సహకరించాలని కోరారు. తాను సమితి సర్వాంగ వికాసానికి శాయశక్తులా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుంద్ర బీడీఓ పి.మనస్మిత మాట్లాడుతూ సమితి నూతన అధ్యక్షుని టీమ్ ప్రజల మన్నలను పొందుతారని తాను ఆకాంక్షిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కుంద్ర బ్లాక్ బీజేడీ అధ్యక్షుడు బృందావన మల్లిక్ మాట్లాడుతూ అధ్యక్షుడు తరుణసేన ప్రజల సమస్యలు పరిష్కరించటంలో ముందుంటారని అన్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో మార్పు!

- సర్వే చేస్తున్న నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం
- ప్రభుత్వానికి త్వరలో నివేదిక

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం మేరకు శ్రీకాకుళంలో అమలు చేయాలనుకుంటున్న కొత్త మాస్టర్ ప్లాన్ విషయంలో జిల్లా అధికారులు పునరాలోచనలో పడ్డారు. 'మాస్టర్ ప్లాన్‌తో గుండెల్లో గుబులు' పేరిట రెండు రోజుల క్రితం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. 150 అడుగులు రోడ్డును నిర్మిస్తే ఏయే ప్రాంతాలు దెబ్బతింటాయో పరిశీలించాలని నగరపాలక సంస్థ, సుడా అధికారులను ఆదేశించారు. దీంతో ఆయా శాఖలోని ప్రణాళికా విభాగం అధికారులు మంగళ, బుధవారాల్లో సర్వే నిర్వహించారు. ఈ రోడ్డు పరిధిలో ఏయే భవనాలు దెబ్బతింటాయో పరిశీలించి నివేదించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీని ఆధారంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేసి, ప్రభుత్వానికి నివేదించాలని నిశ్చయించారు. అటు తర్వాత మాస్టర్ ప్లాన్ వల్ల ఆలయాలు, అపార్ట్‌మెంట్లు, భవనాలు, ఆస్పత్రులు దెబ్బతింటాయని జిల్లా ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రభుత్వానికి నివేదించి, కొత్తగా చేసిన మార్పుల మేరకు ప్రభుత్వం ఆమోదించేలా చేయాలని నిర్ణయించారు. అయితే ఈ రోడ్డు వేయాలనుకునే ప్రాంతంలో ఖాళీ స్థలాలు ఉన్న పక్షంలో వాటిలో మాత్రం ఎటువంటి మార్పులు లేకుండా, కేవలం నగరపాలక సంస్థ అనుమతితో నిర్మించిన భవనాలను ఉంటే వాటిని పరిగణలోనికి తీసుకుంటారని సమాచారం.



మాస్టర్ ప్లాన్(ఫైల్)

ఆదేశాలు వచ్చాయి..

మాస్టర్ ప్లాన్‌లో చిన్న చిన్న మార్పులు చేయాలని జిల్లా అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలు మేరకే సర్వే చేస్తున్నాం. ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తాం. గతంలో ఆమోదించిన మాస్టర్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు చేసి భవనాలు లేని ప్రాంతం నుంచి 150 అడుగుల రోడ్లు, ఇతర రోడ్ల నిర్మాణం అయ్యేలా కొత్తప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం. జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా కొత్తగా ప్లాన్ తయారుచేసి తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

– ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

సారాపై ఉక్కు పాదం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నాటుసారా తయారీ విక్రయాన్ని పూర్తిగా అరికట్టడానికి 'నవోదయం 2.0' కార్యక్రమం కింద కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సారా రహిత జిల్లా లక్ష్యం సాధించే వరకు దాడులు, నిఘా కొనసాగుతాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఫిబ్రవరి నుంచి తీసుకున్న చర్యల వివరాలను కలెక్టర్‌కు సమర్పించారు. ఇప్పటివరకు 179 ఐడీ లిక్కర్ కేసులు నమోదు చేయగా, 221 మందిని అరెస్టు చేశామని, 3477.8 లీటర్ల ఐడీ మద్యం స్వాధీనం చేసుకోగా, 27,790 లీటర్ల జేఎఫ్ (ఎఫ్‌జె) వాష్‌ను ధ్వంసం చేశామని వివరించారు. 75 కిలోల బెల్లం, 17 వాహనాలను అధికారులు సీజ్ చేశామన్నారు. బెల్లం సరఫరాదారులపైనా దృష్టి సారించి, ఆరుగురు వ్యాపారులను కూడా అరెస్టు చేసినట్టు వెల్లడించారు. సారా గురించి సమాచారం తెలిస్తే 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్ తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతి చెందిన పోలీసు కుటుంబానికి 'చేయూత'


మృతుడి కుటుంబానికి చేయూత చెక్ ఇస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసి, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బి.నాగభూషణరావు కుటుంబానికి 'చేయూత' సహాయం ద్వారా రూ.1,48,600ల చెక్కును ఆయన భార్య ధనలక్ష్మికి ఎస్పీ ఏఆర్ దామోదర్ తన చాంబర్‌లో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు సిద్ధగా ఉన్నామన్నారు. ఇందుకోసం ప్రతి సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి నెలవారి జీతంలోకొంత నగదు పోగు చేసి ఇస్తుండడం స్ఫూర్తిదాయకమని ఎస్పీ దామోదర్ అన్నారు. ఈ తరహా చర్యలు పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెంచడంతో పాటు వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా కల్పించడమేనన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.శ్రీనివాసరావు, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు సంక్షేమ సంఘం అడహాక్ కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఇద్దరికి అస్వస్థత

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గురువారం సాయంత్రం ఇంటిడాబాపై పని చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పిడుగుపాటు బారిన పడి అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన సింగవరపు సీతారాం, సీహెచ్.ఆదినారాయణలు ఇంటి డాబాపై పని చేస్తుండగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో పిడుగుపాటుకు గురయ్యారు. దీంతో వారిద్దరినీ జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి బాగానే ఉన్నట్లు సమాచారం.

షిప్‌యార్డ్‌లో ఉద్యోగాలకు శిక్షణ


జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురంటౌన్: విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ కంపెనీలో ఉద్యోగాల కోసం 3 నెలల నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ఐటీఐ అభ్యర్థులకు 3 నెలలు నైపుణ్య శిక్షణ ఇచ్చి షిప్ యార్డులో ఉద్యోగం కల్పిస్తున్నట్లు వివరించారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ 9676965949 నంబర్‌ను సంప్రదించాలని ఆయన ప్రకటనలో కోరారు.

అమ్మవారి తెప్పోత్సవానికి ఏర్పాట్లు


తెప్పోత్సవం ప్రారంభ వేదిక పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

విజయనగరం: పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని విజయనగరం నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కె.సాంబమూర్తి అన్నారు. ఈ నెల 14న మంగళవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశామని తెలిపారు. నగరంలోని వనంగుడి ప్రాంతంలో ఉన్న ఘాడీఖాన సమీపంలో ఉన్న పెద్ద చెరువు గట్టు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచే కార్యక్రమాలను గురువారం చేపట్టారు. ముఖ్యంగా తెప్పోత్సవానికి ప్రారంభ వేదికగా ఉన్న గట్టు ఇతర ప్రాంతాల్లో చెత్త చెదారాలను తొలగిస్తున్నారు. జాతరలు, ఉత్సవాల సమయంలో ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన అంశమని ఆయన అన్నారు. పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

13నుంచి ఐద్వా రాష్ట్ర మహాసభలు


ఐద్వా ఆధ్వర్యంలో మహాసభల జెండా ఆవిష్కరణ

విజయనగరం గంటస్తంభం: మహిళా హక్కుల కోసం నిరంతర పోరాటం సాగిస్తున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర స్థాయి 16వ మహాసభలు ఈ నెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎల్బీజీ నగర్‌లో గురువారం ఐద్వా జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఐద్వా మహిళా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ సమాజంలో మార్పు తీసుకువస్తోందని తెలిపారు.

పాడి రైతులపై దాడి

- నీలావతి గ్రామంలో పశువుల శాలల తొలగింపు యత్నం
- తీవ్రంగా ప్రతిఘటించిన రైతులు
- జేసీబీల అడ్డగింత
- వెనుదిరిగిన పోలీస్, రెవెన్యూ అధికారులు


రైతు పశువులశాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గంట్యాడ: కూటమి సర్కార్ అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇలాకాలో కూటమి నేతలు మరింతగా రెచ్చి పోతున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై నిన్న, మొన్నటి వరకు తమ ప్రతాపాన్ని చూపించిన కూటమి నేతలు తాజాగా పాడి రైతులపై కూడా అరాచకానికి తెరలేపారు. దీంతో కడుపు మండిన రైతులు తీవ్రస్థాయిలో పోలీసులు, రెవెన్యూ అధికారులను ప్రతిఘటించారు.

పశువుల శాలలు తొలగించే ప్రయత్నం

నీలావతి గ్రామంలో పాడి రైతులకు చెందిన పశువుల శాలలను తొలగించేందుకు గురువారం ప్రయత్నించారు. ఈ మేరకు ఉదయం 7 గంటలకే భారీగా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది జేసీబీలతో సహా గ్రామానికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత గ్రామంలో ఉన్న 25 మంది పశువుల శాలలను తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు దారు అధికార పార్టీ వ్యక్తి కావడంతో అధికారులు కూడా పశువులు శాలలు తొలగించేందుకు సిద్ధమయ్యారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా ఫిర్యాదు చేసిన వ్యక్తి చెప్పిన విధంగా చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువుల శాలలను రెవెన్యూ అధికారులు తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా రైతులు వారిని అడ్డుకున్నారు. మరో వైపు జేసీబీతో శాలను తొలగించేందుకు దించుతుండగా మహిళలు, రైతులు జేసీబీని అడ్డుకున్నారు. పశువులకు, మాకు గోతులు తీసి అందులో పాతిపెట్టిన తర్వాత మీరు పశువుల శాలలను తొలగించుకోండి. మాలాంటి పేదవారి ఉసురు కచ్చితంగా మీకు తగులుతుందంటూ శాపనార్థాలు పెట్టారు.

తీవ్రప్రయత్నం చేసిన అధికారులు

పశువుల శాలలను ఏవిధంగా నైనా తొలగించేందుకు రెవెన్యూ, పోలీస్ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఒకవైపు రెవెన్యూ సిబ్బంది పశువుల శాలలకు చెందిన చెక్కలు, కర్రలు, కమ్మలు తొలగించడంతో రైతులు అడ్డుకోగా మరోవైపు జేసీబీతో శాలలను తొలగించేప్రయత్నం చేశారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. వర్షాకాలం ఉన్న పళంగా వెళ్లిపోమంటే పశువులను ఎక్కడ కట్టాలి. వట్టి గడ్డిని ఎక్కడ వేయాలి. మాకు నెలరోజులు సమయం ఇవ్వండని రైతులు తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డిని కోరారు. నా చేతిలో ఏమి లేదు, నేను ఏమీ చేయలేనని ఆయన అనడంతో అయితే మాపీకలు కోసేసి మీరు శాలలు తీసుకోండని తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. దీంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు వెనుదిరిగారు.

మూమ్మాటికీ కక్ష సాధింపే



యువకుడు మంత్రి అయ్యాడు అభివృద్ధి చేస్తాడనుకున్నాం. కానీ ఈవిధంగా రైతులపై ప్రతాపం చూపిస్తాడనుకోలేదు. వైఎస్సార్ సీపీ తరఫున రైతులకు అండగా పోరాటం చేస్తాం.

వర్రి నరసింహ మూర్తి, జెడ్పీటీసీ పీరుబండి జైహింద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు


జేసీబీని అడ్డుకుంటున్న మహిళలు


తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న మహిళలు


పోలీసులను అడ్డుకుంటున్న మహిళలు


సంఘటన స్థలంలో అధికసంఖ్యలో చేరుకున్న రైతులు, పోలీసులు

11,12 తేదీల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి గురువారం తెలిపారు. రింగ్‌రోడ్‌లో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించే పోటీల్లో ఓపెన్ టాప్-10 మంది క్రీడాకారులకు రూ.15 వేల నగదు బహుమతి ప్రదానం చేయనున్నామన్నారు. పోటీల్లో అండర్ -7,9,11, 13,15 వయస్సులకు చెందిన క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ 7416666567 నంబర్‌ను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

19న రెవెన్యూ సంఘం ఎన్నికలు

పార్వతీపురం రూరల్: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు ఈనెల 19న ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో జరగనున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ ఎన్నికలకు అధికారిగా కె. శ్రీరాములు, సహాయ అధికారిగా బీవీబీఎన్ రాజు, పరిశీలకులుగా సీహెచ్ బంగార్రాజులను నియమించినట్లు ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గొట్టాపు శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ ఎన్నికల్లో భాగంగా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి వంటి 16 కార్యవర్గ సభ్యులను ఎన్నుకోనున్నట్లు చెబుతూ జిల్లా రెవెన్యూ ఉద్యోగులందరూ హాజరై ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

చెరువులో పడి పూజారి మృతి


చెరువువద్ద ఆరాతీస్తున్న ఎస్సై ఫకృద్దీన్

గరుగుబిల్లి: చెరువులో స్నానానికి దిగిన ఓ పూజారి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. గరుగుబిల్లి మండలంలో గురువారం జరిగిన సంఘటనపై స్థానిక ఎస్సై ఫకృద్దీన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావుపల్లిలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన తెలగవీధిలోని రామమందిరం ఆలయ పూజారిగా పనిచేస్తున్న సంగం చంద్రశేఖర్ (53) స్నానానికి బోటువాని చెరువులో దిగుతున్న సందర్భంలో ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మునిగిపోయాడు. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. కొద్ది సమయం తరువాత చెరువులో చంద్రశేఖర్ మునిగిపోయినట్లు స్థానికులు గుర్తించి స్థానిక ఎస్సైకి సమాచారం అందించడంతో ఆయన సిబ్బందితో వచ్చి మృతదేహం కోసం స్థానికుల సహాయంతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు గ్రామంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరరావు సమక్షంలో శవ పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికిచ మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆలయ పూజారి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

కోనేరులో పడి యువకుడు..


వేపాడ: ఆంజనేయులు మృతదేహం

వేపాడ: మండలంలోని బానాది గ్రామానికి చెందిన సంపర్తి ఆంజనేయులు (32) కోనేరులో జారిపడి గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వల్లంపూడి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంపర్తి ఆంజనేయులు తల్లి ఎర్రయ్యమ్మచెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లింది. బట్టలు మూటకడుతుండగా మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఆంజనేయులు కాలుజారి కోనేరులో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు మృతుడి తల్లి ఎర్రయ్యమ్మ ఫిర్యాదుపై వల్లంపూడి హెచ్‌సీ శివకేశవరావు కేసు నమోదుచేసి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

గోడకూలి మహిళ..

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు


అప్పయ్యమ్మ మృతదేహం

బొబ్బిలి: పట్టణంలోని గొల్లవీధి జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలి ఎరుకల వీధికి చెందిన తోనంగి అప్పయ్యమ్మ(52) అక్కడికక్కడే మృతి చెందగా కూలీలు రామలక్ష్మి, పొందూరు లక్ష్మణలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎస్సై రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి నిర్మాణ పనులకు వెళ్తున్న వారు ముగ్గురు ఎప్పటిలాగానే లక్కోజు శ్రీనివాసరావు ఇంటి పనులు చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇటుకల గోడ నానిపోయి పనిచేస్తున్న వారిపై పడగా అప్పయ్యమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. రామలక్ష్మి, లక్ష్మణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నట్లు, అప్పయ్యమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.అప్పయ్యమ్మ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

4జీ టవర్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

- జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు 4జీ ఇంటర్‌నెట్ సేవలను వేగంగా అందించేందుకు టవర్ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి జియో, బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థలను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ తొలిదశలో భాగంగా వాహనాలు వెళ్లే సౌకర్యం ఉన్న కొమరాడ, సాలూరు, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని పది గ్రామాల్లో వెంటనే పనులు మొదలు పెట్టాలని సూచించారు. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు ఉపాధిహామీ పథకం కింద రోడ్లు నిర్మించి, పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలన్నీ ఇంటర్ నెట్‌తో ముడిపడి ఉన్నందున ఏ గ్రామంలోనూ సిగ్నల్ సమస్యలు ఉండరాదని ఆయన తెలిపారు. టవర్ల ఏర్పాటుకు స్థలాలు అనుకూలంగా లేకపోతే ప్రత్యామ్నాయాలు చూడాలని ఇప్పటికే ఉన్న టవర్ల సిగ్నల్ సమస్యలను కూడా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్లు ఆర్.వైశాలి, పవర్‌సప్నిల్ జగన్నాథ్, ఉప కలెక్టర్లు ధర్మచంద్రారెడ్డి, దిలీప్‌చక్రవర్తి, డీఎంజీఓ శ్రీనివాసరావు, పలు మండలాల తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడు


రాజేశ్వరరావు (ఫైల్)


రాజేశ్వరరావు మృతదేహం

బాడంగి: వ్యసనాలకు బానిసైన కొడుకు మద్యం కోసం డబ్బు లివ్వలేదని కన్నతండ్రినే హతమార్చాడు. బాడంగిలో జరిగిన ఈ విషాదకర సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని సినిమా కాలనీలో నివాసముంటున్న బలిజిపేటకు చెందిన బోనుగిరి రాజేశ్వరరావు (70)ను చిన్నకుమారుడు లక్ష్మణరావు చెప్పులు కుట్టుకునే గూటంతో కొట్టి హతమార్చాడు. మద్యం కొనుగోలుకోసం డబ్బులిమ్మని అడగ్గా తండ్రీకొడుకుల మధ్య బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఆవేశపరుడైన కుమారుడు చెప్పులు కుట్టే గూటంతో తండ్రి చెవిపైన బలంగా కొట్టగా తండ్రి రాజేశ్వర రావు స్పృహ కోల్పోయి అక్కడికక్కడే కుప్పకూలాడు. గురువారం తెల్లవారుజామువరకు ఈవిషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడి సాధారణ మరణంగా నమ్మబలికే ప్రయత్నం చేశారు. కుమారుడే కాలయముడన్న విషయం చుట్టుపక్కల వారికి తెలిసిపోవడంతో చేసేదిలేక హతుడి భార్య ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి ముగ్గురు పిల్లలు కాగా పెద్దకుమారుడు గతంలో రైలు ప్రమాదంలో చనిపోగా కుమార్తెకు వివాహంచేసి అత్త వారింటికి పంపారు. చిన్నకుమారుడు లక్ష్మణరావు సిమెంట్‌పని, పెయింటింగ్ వర్క్ చేసుకుంటూ వ్యసనాలకు బానిసగా మారి తరచూ తల్లిదండ్రులతో తగాదాలు పడుతుంటాడని ఇరుగుపొరుగు వారి సమాచారం మేరకు తెలిసింది. హత్య సంఘటనపై సమాచారం అందుకున్న బొబ్బిలి రూరల్ సీఐ నారాయణ రావు, ఎస్సై తారకేశ్వరరావు, డీఎస్పీ భవ్యరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేయగా, సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో విజేతలుగా నిలవాలి


బాక్సింగ్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు


తైక్వాండో పోటీలకు బయల్దేరిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలవాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.గోపాల్, విజయలక్ష్మిలు ఆకాంక్షించారు. ఈనెల 10 నుంచి 12 వరకు పశ్చిమగోదావరి జిల్లా రాజమండ్రిలో అండర్ 14,17 బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు, ఈ నెల 10 నుంచి 12 వరకు బాపట్ల జిల్లా రేపల్లెలో జరగబోయే అండర్ 14 తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు గురువారం పయనమయ్యారు. వారికి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు పలు సూచనలు, సలహాలు చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ క్రీడా ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వర్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థినులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కుమరాపు జనార్దనరావు గురువారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన పోటీల్లో వాలీబాల్ విభాగానికి సంబంధించి మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన టి.సూర్యకుమారి, ఎ.నిరోషి, ఎం.గౌతమి, ఎస్.జయశ్రీ, బి.వెంకటలక్ష్మి, సీహెచ్ పవిత్ర, కబడ్డీలో ఎస్.యశోని, స్విమ్మింగ్‌లో ఎల్.కల్పనలు అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను కళాశాల ఆవరణలో అభినందించారు. రాష్ట్రస్థాయిలో కళాశాలకు మంచి పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో ప్రిన్సిపాల్‌తోపాటు పీఎస్ఎన్‌గుప్త, ప్రసన్నకుమార్, అనిల్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు


చోరీ నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామంలో రైతు భరోసా కేంద్రం, ఆయుష్మాన్ భవన్ మందిర్ కార్యాలయంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కురుపాం ఎస్సై నారాయణ రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ గుమ్మ గ్రామంలో రైతు భరోసా కేంద్రం, ఆయుష్మాన్ భవన్ కార్యాలయంలో గల కంప్యూటర్ల పరికరాలైన సీపీయూ, కీబోర్డులు చోరీకి గురైనట్లు సంబంధిత సిబ్బంది బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా గుమ్మ గ్రామ సమీపంలో చిట్టిగెడ్డ దగ్గర అనుమానస్పదంగా తిరుగుతున్న బర్లి చందు, సింగమహంతి అవినాష్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించారన్నారు. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు. చోరీ చేసిన కంప్యూటర్ పరికరాల విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. దర్యాప్తులో ఏఎస్సై సత్యనారాయణ, కానిస్టేబుల్ శేఖర్‌మధు పాల్గొన్నట్లు చెప్పారు.

బాణసంచా విక్రయాలపై కఠిన చర్యలు

- కలెక్టర్ ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి

విజయనగరం అర్బన్: జిల్లాలో అనుమతి లేకుండా బాణసంచా విక్రయాలు లేదా తయారీ జరుగుతున్న చోట కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో కూడా తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా వ్యాప్తంగా బాణసంచా విక్రయాలు, తయారీ పరిస్థితులపై పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ విభాగాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లలో మొత్తం ముగ్గురు తయారీదారులు, 15 మంది హోల్‌సేల్ విక్రేతలు ఉన్నారని తెలియజేశారు. ఆర్డీఓలు డి.కీర్తి, మోహనరావు, ఆశయ్య తమ పరిధిలో జరుగుతున్న విక్రయాలపై వివరాలు సమర్పించారు.కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాణసంచా విక్రయం ఏ స్థాయిలోనైనా నిర్వహించాలంటే అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. హోల్‌సేల్ షాపులపై పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులు సంయుక్త తనిఖీలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో జరిగే విక్రయాలను వీఆర్‌ఓలు పర్యవేక్షించాలని సూచించారు. అనుమతి పొందిన విక్రేతలు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నీరు అందుబాటులో ఉంచాలి. ఫైర్ సిలిండర్ లభ్యతను నిర్ధారించాలని కలెక్టర్ చెప్పారు. తాత్కాలిక విక్రయాల ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్ వెళ్లేందుకు తగిన ఖాళీ ఉంచాలని, టెంట్లకు బదులు రేకులతో షెడ్లు నిర్మించాలని సూచించారు. విక్రేతలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారికి నిబంధనలు, భద్రతా మార్గదర్శకాలు వివరించాలని ఆర్డీఓలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి రాంప్రసాద్, డీఎస్పీ వీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు, యువత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎన్‌సీసీ గ్రూప్ కమాండింగ్ అధికారి సుమంత్ రాయ్ సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించి, విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని, అర్హులైన ప్రతిఒక్కరూ ఎన్‌సీసీలో చేరాలన్నారు. అనంతరం బీహార్‌కు బదిలీపై వెళ్తున్న ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ తపస్ మండల్‌ను ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. అలాగే కొత్త కమాండింగ్ అధికారి సుమంత్‌రాయ్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వైస్ చాన్సలర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి ఆటో డ్రైవర్ ఆత్మహత్య

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బౌరోతు సాయి(23) బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై జి.కళాధర్ తెలిపిన వివరాల ప్రకారం ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు గల కారణాలు ఇలా ఉన్నాయి. కాంచన అనే ఆమెతో ఏడాది క్రితం సాయికి వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాలడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లిదండ్రులు మోహనరావు, విజయల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.